నల్లగొండ నుంచి నరుక్కొద్దాం

మూసీపై రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎత్తుగడ • ప్రాజెక్టుపై ఎగువన పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకత • ఇండ్ల కూల్చివేతపై భగ్గుమన్న ప్రజలు, ప్రతిపక్షాలు

దిగువ నుంచి డిమాండ్ వచ్చేలా కొత్తగా పథకం • మూసీ ప్రక్షాళనకు 'మద్దతు'గా కాంగ్రెస్ నేతల సదస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): మూసీ పునర్జీవ ప్రాజెక్టుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతుండటంతో ప్రభుత్వం కొత్త ఎత్తుగడ వేసింది. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను కూల్చడంపై బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రతిపక్షాలు భగ్గుమనగా, కాంగ్రెస్‌లోనూ భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. నది జన్మస్థానం నుంచి రాజధాని దాటేదాకా ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ప్రజా ఉద్యమాలు, కోర్టుల్లో కేసులు వంటివాటితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రభుత్వ పెద్దలు.. ఎలాగైనా తమ కలల ప్రాజెక్టును సాకారం చేసుకునేందుకు కొత్త ఆలోచన అమలు చేస్తున్నారు. ప్రాజెక్టు వద్దంటూ ఎగువన వినిపిస్తున్న డిమాండ్‌కు పోటీగా దిగువన నల్లగొండ వైపు నుంచి ప్రాజెక్టుకు మద్దతు కూడగట్టాలని నిర్ణయించింది. ప్రక్షాళన చేయాలంటూ ప్రజలే డిమాండ్ చేస్తున్నట్టు సీన్ సృష్టించాలని భావిస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే అవగాహన యాత్రలు, చైతన్య యాత్రల పేరుతో కార్యక్రమాలు మొదలుపెట్టింది. అయితే ప్రజల నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. దీంతో ఉమ్మడి నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు ప్రజల్లోకి వెళ్లాలని, విరివిగా సభలు, సమావేశాలు నిర్వహించాలని పార్టీ పెద్దలు ఆదేశించారట. ఈ నేపథ్యంలో వరుసగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్తున్నారు.

రమ్మంటే రాలేదు..

మూసీ ప్రాజెక్టుకు మద్దతుగా ఇటీవల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టుకు మద్దతు కూడగట్టేందుకు ఈ సమావేశాన్ని వాడుకోవాలని భావించారు. గ్రామాల నుంచి రైతులను తీసుకురావాలని, జనసమీకరణ చేయాలని అనుకున్నారు. కానీ కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయ్యింది. రైతులు, ప్రజల నుంచి స్పందన రాలేదు. దీంతో కాంగ్రెస్ పెద్దలు ఆలోచనలో పడ్డారట. 'ప్రజలు మనం పిలిస్తే రావడం లేదు.. కాబట్టి మనమే వెళ్లి వాళ్ల మధ్య తిరగాలి' అని నిర్ణయించుకున్నారని చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఉమ్మడి నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాదయాత్రలు, అవగాహన సదస్సుల పేరుతో మూసీ ప్రాజెక్టుకు మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. రెండుమూడు రోజుల్లో కనీసం 10వేల మందితో సభలు నిర్వహించాలని పార్టీ పెద్దలు ఆదేశించినట్టు తెలుస్తున్నది. చివరగా.. మరో వారం రోజుల్లో నల్లగొండలో లక్ష మందితో సభ నిర్వహించాలని ప్రణాళిక రూపొందించారని సమాచారం. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని చెప్తున్నారు. ఎగువన ప్రజల పోరాటాన్ని నది దిగువన ఉన్న ప్రజల పోరాటంతో అడ్డుకోవాలని ప్రభుత్వం చూస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

లోకం పోకడ



తుస్సుబాంబులు నన్నేం చేస్తయ్!

- ఒరిజినల్ బాంబులకే భయపడలేదు
- ఉత్తుత్తి బాంబులు నాకు లెక్కకాదు
- చావుకైనా తెగించి కొట్లాడుతాం
- ఎన్నికేసులు పెడతారో పెట్టుకోండి
- మేమొచ్చాక మిత్తితో సహా తిరిగిస్తం
- విద్యుత్తు చార్జీల పెంచితే ప్రజా ఉద్యమం
- అంబానీ, అదానీ, నేతన్నలు ఒకటేనా?
- డిస్కంల ప్రతిపాదనల వెనక కాంగ్రెస్ హస్తం
- పార్టీమారినవారు రాజకీయ వ్యభిచారులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్. చిత్రంలో సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎల్ రమణ, సుంకె రవిశంకర్, కొండూరి రవీందర్‌రావు తదితరులు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): చావుకు తెగించి తెలంగాణ ఉద్యమంలో కొట్లాడామని, కాంగ్రెస్ నాయకుల పిచ్చిపిచ్చి డైలాగులకు భయపడబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చి చెప్పారు. ఒరిజినల్ బాంబులకే భయపడలేదని, గీ సుతిలీ బాంబులు, లక్ష్మీబాంబులు, తుస్సు బాంబులకు భయపడబోమని స్పష్టం చేశారు. ఏదో అడ్డమైన కేసుపెట్టి జైలుకు పంపుతానంటే పంపుకోవచ్చని పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ) బహిరంగ విచారణలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరుతూ విలేకరులతో మాట్లాడారు. దీపావళిలోగా బాంబు పేలుతుందంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. బాంబు అంటే ఆయన మీద జరిగిన ఈడీ రైడ్ మీద ఏమన్నా చెబుతాడేమో? ఈడీ దాడుల్లో ఎన్ని నోట్ల కట్టలు దొరికినయన్నది చెబుతాడో? బీజేపోళ్లను ఎట్ల ప్రసన్నం చేసుకుని సంధికుదుర్చుకున్నది, ఎట్ల బతిమిలాడి కేసు కాకుండా చూసుకున్నది, అదానీ కాళ్లు ఎట్ల పట్టుకొని కాపాడుకున్నడో చెబుతాడా? లేక అమృత్ స్కీంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బామ్మర్దికిచ్చిన రూ.1137కోట్ల కాంట్రాక్టుపై విచారణకు ఆదేశిస్తారన్న బాంబు పేలుస్తారా? అని ఎద్దేవా చేశారు. దీపావళి కంటే ముందు పొంగులేటి బాంబే పేలేటట్టు ఉన్నదని చమత్కరించారు. ఇసొంటి కొత్త బిచ్చగాళ్లను చాలామందిని చూశామని, రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబుతోనే కొట్లాడామని, ఈ చిట్టినాయుడు తమకో లెక్కకాదని ఎద్దేవా చేశారు. ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ సవాల్ విసిరారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాగోతం, ముఖ్యమంత్రి బామ్మర్ది బాగోతం, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్టు రాఘవ కన్‌స్ట్రక్షన్, మేఘా ఇంజినీరింగ్, రూ.4,500 కోట్లను ఎట్ల పంచుకున్నరో అన్నింటినీ బయట పెడతామని చెప్పారు. అడ్డం పొడువు కేసులు పెట్టి తమను ఇబ్బందులు పెట్టాలనుకుంటే అంతకన్నా ఎక్కువ కొట్లాడుతామని చెప్పారు. చావుకైనా తెగించి కొట్లాడుతం తప్ప పిచ్చిపిచ్చి మాటలకు భయపడేది లేదని తేల్చి చెప్పారు.

కేటీఆర్ మానవత్వం

కేటీఆర్ మరోమారు మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించి, తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా తంగళ్లపల్లి మండలం నేరేళ్ల శివారులో సిరిసిల్ల-సిద్దిపేట రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం చూసి వాహనం ఆపారు. అంబులెన్స్‌కు ఫోన్ చేసి గాయపడిన తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లెకు చెందిన వేల్పుల సంజీవ్, సిరిసిల్లకు చెందిన శామంతుల రమేశ్‌ను దవాఖానకు తరలించారు. కేటీఆర్ ఆగడంతో స్థానిక నేతలు చేరుకుని, బాధితులకు సాయం అందించారు. యువకులు బైక్‌పై సిరిసిల్లకు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన నేరేళ్లలోని ఇస్కాన్ టెంపుల్‌కు చెందిన వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో సంజీవ్, రమేశ్, ఓమిని వాహనంలోని ఒక వ్యక్తి గాయపడ్డారు. రమేశ్, సంజీవ్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

> " ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాల వల్ల పారిశ్రామికరంగంలో మందగమనం మొదలైంది. ఫాక్స్‌కాన్ లాంటి సంస్థ తన కంపెనీ విస్తరణను విరమించుకున్నది. ఇలాంటి పరిస్థితిలో పరిశ్రమలను కాపాడుకునేలా వీలైనంత వరకు ప్రోత్సాహకాలు అందించాలి. డిస్కంల ప్రతిపాదనల వెనక కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం హస్తం ఉంది. -కేటీఆర్

> " సంజయ్ ఒక రాజకీయ వ్యభిచారి. పార్టీ మారిన పదిమంది కూడా రాజకీయ వ్యభిచారులే. పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయంటూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి చెప్తుంటే ఫిరాయింపులు జరగలేదని శ్రీధర్‌బాబు బుకాయిస్తున్నడు. రేవంత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి కాళ్లుమొక్కి కండువాలు కప్పుతున్నడు. స్పీకర్ కుయ్‌లేదు కయ్‌లేదు. హైకోర్టు చెప్పినా పట్టించుకోవడం లేదు. పార్టీలు మారితే రాళ్లతో కొట్టి చంపుతామని రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారు. ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలి. ఫిరాయింపులు చేసినోళ్లనా? రాజకీయ వ్యభిచారం చేసేటోళ్లనా? -కేటీఆర్

ఇంతకంటే సిగ్గుచేటు ఉంటుందా?

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదంటున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. ఒక పార్టీకి రాజీనామా చేయకుండా ఇంకో పార్టీలో చేరితే, ఒకరికి విడాకులు ఇవ్వకుండా ఇంకొకరిని చేసుకుంటే దానిని వ్యభిచారమే అంటారని ధ్వజమెత్తారు. జగిత్యాలలో కాంగ్రెసోళ్లను కాంగ్రెసోళ్లే చంపుకుంటున్నారని, పోలీసోళ్ల కుటుంబాలను పోలీసోళ్లే కొడుతున్నరంటే ఇంతకన్నా సిగ్గుచేటు మరోటి ఉండదని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో రేవంత్‌రెడ్డి పనిచేస్తున్న విషయాన్ని జీవన్‌రెడ్డి తెలుసుకున్నారని, ఇన్ని రోజులకు కాంగ్రెసోళ్లకు కనువిప్పు కలిగిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకున్నా, కరెంటు చార్జీలు పెంచినా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

సీఎంకు బుర్రలేదు

పదేండ్ల తమ ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు, ఆకలి చావులు లేకుండా పరిశ్రమలను నడిపించామని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ, పది నెలల కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు, చార్జీల మోతలంటూ మండిపడ్డారు. ఒక్క సిరిసిల్లలోనే పది మంది, ఇతర జిల్లాల్లో ఎనిమిది మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తాము ఆత్మహత్యలు లేని తెలంగాణ చేశామని, పది నెలల మీ పాలనలో ఆటో డ్రైవర్లు, రైతులు, నేతన్నలు ఇంతమంది చనిపోతున్నారని చెప్పారు. ఆ కుటుంబాలకు సహాయం చేయాలని కోరామని, నిర్ణయాలు మార్చుకోవాలని హితవు చెప్పినా బుర్రలేని సీఎం బుద్ధి మారట్లేదని ధ్వజమెత్తారు.

చార్జీల పెంపును తిరస్కరిస్తున్నాం

ఉచిత విద్యుత్తు పేరిట ఉన్న విద్యుత్తును పోగొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. విద్యుత్తు చార్జీల మోతలతో పేద, మధ్య తరగతి ప్రజలపై రూ.18 వేల కోట్లు భారం మోపడమంత దరిద్రమైన ఆలోచన ఇంకోటి లేనేలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిస్థితి తీవ్రత ప్రభుత్వానికి తెలవాలన్న ఉద్దేశంతో గత అయిదు రోజులుగా వరుసగా హైదరాబాద్, వికారాబాద్, నిజామాబాద్, సిరిసిల్లలో ఈఆర్సీని కలుస్తూ ప్రజల తరఫున తమ వాదన వినిపిస్తున్నామని చెప్పారు. చార్జీల పెంపును నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నామని స్పష్టం చేశారు. అయినా సరే ప్రభుత్వం ఇలాగే ముందుకెళ్తే ప్రజల్ని ఐక్యం చేసి ప్రజా పోరాటం ద్వారా అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఉచిత విద్యుత్తు ఇచ్చినా పైసా పెంచలే

దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగానికి తమ ప్రభుత్వంలో 24 గంటల ఉచిత విద్యుత్తు ఇచ్చామని, నాయీబ్రాహ్మణులు, రజకులకు ఉచిత విద్యుత్తు, మరమగ్గాల పరిశ్రమకు సబ్సిడీలు అందించి అండగా నిలిచామని కేటీఆర్ గుర్తు చేశారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పైసా పెంచలేదని స్పష్టం చేశారు. అదానీ, అంబానీ, సిరిసిల్ల నేతన్నలను ఒకే గాటన కడుతారా? అని ప్రశ్నించారు. విద్యుత్తు ఆధారిత మరమగ్గాల పరిశ్రమ తీవ్ర సంక్షోభంతో పదిమంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లలో ఆత్మహత్యలు లేకుండా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను నడిపించామని, పదినెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సిరిసిల్లలోనే పదిమంది కార్మికులు కార్మికులు చనిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. పది హెచ్‌పీల వరకు ఉన్న సిరిసిల్ల మరమగ్గాల విద్యుత్తు సబ్సిడీని 30 హెచ్‌పీలకు పెంచాలని ఈఆర్సీని కోరినట్టు తెలిపారు. ఈ ప్రతిపాదనను లిఖిత పూర్వకంగా ప్రభుత్వానికి ఇవ్వాలని ఈఆర్సీని కోరారు. కేసీఆర్ తీసుకున్న విద్యుత్తు సంస్కరణలతో విద్యుత్తు సంస్థలకు స్వర్ణయుగంగా మారిందని వివరించారు. పాలకులకు విజన్ ఉంటే సంపద పెంచి పేదలకు పంచాలి కానీ, కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపాలన్న ఆలోచన దుర్మార్గమని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ప్రతి మనిషికి విద్యుత్తుతో విడదీయరాని అనుబంధం ఉందని పేర్కొన్నారు. 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ఫిక్స్ చార్జీని రూ.10 నుంచి రూ. 50కి పెంచాలన్న నిర్ణయం వాయిదా వేసుకోవాలని డిమాండ్ చేశారు.

7 వేల మెగావాట్లను 24 వేలకు పెంచాం

డిస్కంల నిర్ణయం కారణంగా రాష్ట్రంలోని పరిశ్రమలు మూతపడి లక్షలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దానిని ఎలా అమలు చెయ్యాలో తెలియక అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. 7 వేల మెగావాట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి ఉంటే దాని సామర్థ్యాన్ని 24వేల మెగావాట్లకు పెంచిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు.

> " ఒక్కటి మాత్రం చెబుతున్నా. వచ్చేది మన ప్రభుత్వమే. ఒక్కొక్కడు తెగించి రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు. ఎవరైతే బిల్డర్లను బెదిరించి ఆర్ ఆర్ ట్యాక్స్‌లు వసూలు చేస్తున్నారో వాళ్లకు మిత్తితో సహా తిరిగి ఇస్తాం. -కేటీఆర్

ఎమ్మెల్యే సంజయ్‌పై
హత్య కేసు పెట్టాలి

తన అనుచరుడికి మార్కెట్ చైర్మన్ పదవి కోసం గంగారెడ్డిని సంజయ్ హత్య చేయించిండు

ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎమ్మెల్యే లక్ష్మణే మీడియాతో చెప్పిండ్రు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ కార్యకర్త గంగారెడ్డి మర్డర్ విషయంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌పై హత్య కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంజయ్‌పై జగిత్యాల ఎస్పీ ఎందుకు కేసు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం మారు గంగారెడ్డిని తన అనుచరుడితో సంజయ్ హత్య చేయించారని స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ చెప్తున్నారని, ఈ ఆరోపణలను తాను కూడా నమ్ముతున్నానని చెప్పారు. తెలంగాణలో హత్యా రాజకీయాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. తెలంగాణభవన్‌లో గురువారం బీఆర్ఎస్ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, పల్లె రవికుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎమ్మెల్యే సంజయ్ తన అనుచరుడైన నారాయణరెడ్డి పేరును ప్రతిపాదించారని, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తన అనుచరుడైన గంగారెడ్డి పేరు ప్రతిపాదించారని పేర్కొన్నారు. నారాయణరెడ్డికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇప్పించేందుకు సంతోష్ అనే వ్యక్తితో గంగారెడ్డిని హత్య చేయించారని స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే చెప్పినప్పుడు సంజయ్‌పై మర్డర్ కేసు ఎందుకు నమోదు చేయరు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉన్నదా? అని ఫైరయ్యారు. తాను కాంగ్రెస్‌లో చేరలేదంటున్న ఎమ్మెల్యే సంజయ్.. గాంధీభవన్‌లో జరిగిన మీటింగ్‌కు ఎందుకు హాజరయ్యారని, రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎందుకు పాలాభిషేకం చేశారని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారని, దాన్ని ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ డబ్బులు ఢిల్లీకి తరలుతాయని నాడు కేసీఆర్ చెప్పినట్టుగానే నేడు వయనాడ్‌కు తరలుతున్నాయని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు.

లై డిటెక్టర్ టెస్ట్‌కు వచ్చే దమ్ముందా రేవంత్

- ఫోన్‌ట్యాపింగ్‌పై బహిరంగంగా చర్చిద్దాం
- మా ఫోన్లు ట్యాప్ చేస్తున్నరు
- 50 లక్షలతో దొరికినోళ్లను ఏమనాలి
- 300 రోజులైనా గాల్లోనే గ్యారెంటీలు
- ప్రజల మనసును తిరిగి గెలుచుకుంటాం
- రాష్ట్ర భవిష్యత్తు కోసమే కేసీఆర్ ఆరాటం
- ఏబీపీ న్యూస్ సదరన్ సమ్మిట్‌లో కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే రాష్ట్రంలో మంత్రుల ఫోన్లు.. మా ఫోన్లు ట్యాప్ చేయటం లేదని చెప్పాలి.. కెమెరాల ముందు ఓపెన్‌గా లైడిటెక్టర్ పరీక్షకు రావాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. రేవంత్‌కు దమ్మూ ధైర్యం ఉంటే తన సవాల్‌ను స్వీకరించి ఫోన్లు ట్యాప్ చేయటం లేదని చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష నేతల ఫోన్‌లను కూడా రేవంత్‌రెడ్డి ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపించారు. సీఎం స్థానంలో ఉండి రేవంత్‌రెడ్డి నీచమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏబీపీ న్యూస్ నిర్వహించిన సదరన్ సమ్మిట్‌లో పాల్గొన్న కేటీఆర్, పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని నమ్మబలికి 300 రోజులైనా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. రూ. 50 లక్షల నోట్ల కట్టలతో అడ్డంగా పట్టుబడిన రేవంత్‌రెడ్డిని దొంగ అనకుంటే ఏమనాలని ప్రశ్నించారు. డబ్బుతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాన్ని అస్థిర పరచాలని కుట్రచేస్తున్న క్రమంలో దొరకబట్టి రేవంత్ రెడ్డిపై ఆనాడు కేసు పెట్టాల్సి వచ్చిందని వివరించారు. ఓటమి కారణాలను విశ్లేషించుకున్నామని, బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ అని, ప్రజల మనసులను గెలిచి తిరిగి అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఫిరాయింపు సంస్కృతి తెచ్చిందే కాంగ్రెస్

దేశంలో పార్టీ ఫిరాయింపుల సంస్కృతికి ఆజ్యం పోసిందే కాంగ్రెస్ అని కేటీఆర్ మండిపడ్డారు. నెహ్రూ కాలం నుంచి కాంగ్రెస్ ఫిరాయింపులను ప్రోత్సహిస్తే మోదీ హయాం వచ్చే సరికి అది తీవ్రరూపం దాల్చిందని చెప్పారు. ప్రశ్నించే పార్టీలను మట్టుబెట్టడమే పనిగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చిందని గుర్తుచేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలాగా ఫిరాయింపులను ప్రోత్సహించలేదని, రేవంత్‌రెడ్డి మాదిరిగా ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి కేసీఆర్ కండువా కప్పలేదని చెప్పారు. రాజ్యాంగ బద్ధంగా కాంగ్రెస్ శాసన సభాపక్షం బీఆర్ఎస్‌లో విలీనమైందని గుర్తుచేశారు. పార్టీ ఫిరాయింపులకు తాము వ్యతిరేకమని, కండువా మారితే సభ్యత్వం ఖతమేనని రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించారని, తెలంగాణలో ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.తమది ప్రేమ సమూహమని, ప్రేమ దుకాణమని చెప్తున్న రాహుల్‌గాంధీ తెలంగాణలో మాత్రం బుల్డోజర్‌రాజ్‌ను ప్రోత్సహిస్తున్నారని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ బుల్డోజర్ల నుంచి పేదలను కాపాడటంపై రాహుల్ దృష్టి పెట్టాలన్నారు.

ఓటమి కారణాలను సమీక్షించుకున్నాం

ఎన్నికల్లో ఓటమి కారణాలపై సమీక్షించుకున్నామని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 64 సీట్లు, బీఆర్ఎస్‌కు 39 సీట్లు వచ్చినా, ఓట్లశాతంలో తేడా కేవలం 1.8శాతమేనని వివరించారు. 14 స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు స్వల్పతేడాతో ఓడిపోయారని చెప్పారు. పదేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో అద్భుతాలు సృష్టించిందని వివరించారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రమే అయినా వ్యవసాయం, విద్యుత్తు, ఐటీ, గ్రీన్‌కవర్ ఇలా అనేక రంగాల్లో అత్యద్భుత ప్రగతిని సాధించి దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగంలో దేశంలోనే లక్షా 60వేల ఉద్యోగ నియమకాలు చేపట్టామని, ఆ విషయంపై ప్రచారం చేసుకోలేకపోయామని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆ మాటకొస్తే కేంద్రప్రభుత్వం కన్నా ఉద్యోగులకు 73 శాతం జీతాలు పెంచినా ప్రచారం చేసుకోలేదని, ఇలా అనేక అంశాల్లో అద్భుతాలు సృష్టించినా ప్రచారం చేసుకోలేకపోయామని చెప్పారు. పదేండ్లు పాలించిన ప్రభుత్వంపై సహజంగా ఉండే వ్యతిరేకతే తమకూ ఎదురైందని, దీనికి తోడు సోషల్‌మీడియాలో అదేపనిగా విమర్శలు వెల్లువెత్తినా పనిచేస్తూ పోయామే తప్ప వెనుతిరిగి చూడలేదని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అభివృద్ధికి బాటలు వేశామని, గ్రామీణ ప్రజల కోసం అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని వివరించారు.



నిర్మాణాత్మక పాత్రపోషిస్తున్నాం

ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో, వారి ఆకాంక్షల కోసం పోరాటం చేయడంలో సంతృప్తిగా పనిచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా తమ పాత్ర పోషిస్తున్నామన్నామని చెప్పారు. కొంతమంది తనపై అర్థంలేని విమర్శలు చేస్తున్నారని, తనపై చేస్తున్న అవినీతి, అహంకారం వంటి విమర్శలను రుజువు చేయాలని ఆయన సవాల్ విసిరారు.

తెలంగాణ భవిష్యత్తు కోసమే కేసీఆర్ ఆరాటం

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, వాటి పట్ల చలించిపోయేతత్వం కేసీఆర్‌ది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ బలమైన మనస్తత్వం, వ్యక్తిత్వం జీవితంలో అనేక ఒడిదొడుకులను చూసిందన్నారు. నిరంతరం భవిష్యత్తు కోసమే కేసీఆర్ ఆలోచిస్తారని చెప్పారు. తెలంగాణ కోసం ప్రణాళికలు రచిస్తున్నారని వివరించారు. అరచేతిలో వైకుంఠాన్ని చూపించి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ తీరుపైనా, ఆ పార్టీ పాలన వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కేసీఆర్ ఆవేదన చెందుతున్నారని చెప్పారు. ప్రజలు మరోసారి కేసీఆర్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం కాంగ్రెస్, బీజేపీల కన్నా గొప్పగా పనిచేసిందని తెలిపారు.

మా పార్టీనే విలీనం చేద్దామనుకున్నం

తెలంగాణ సాధన కోసం ఏర్పాటైన నాటి టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్)ను రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్‌లో విలీనం చేయాలనుకున్నామని కేటీఆర్ పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ వల్లే విలీనం కాలేదని, కాకపోవటం వల్లే తెలంగాణకు మేలు జరిగిందని చెప్పారు. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్లే అవకాశం తమకు లభించిందని, అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని గొప్పగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. అధికారం శాశ్వతమని తామేనాడూ అనుకోలేదని, అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలని తమ సర్వశక్తులా ప్రయత్నాలు చేశామని, అందులో తాము విజయం సాధించామని పేర్కొన్నారు.

సమాంతరంగా అభివృద్ధి చేశాం

తెలంగాణలో గ్రామీణ, నగర ప్రాంతాలను సమగ్రంగా, సమాంతరంగా అభివృద్ధి చేశామని కేటీఆర్ స్పష్టంచేశారు. పదేండ్లలో అభివృద్ధి, ప్రభుత్వ పాలనపైనే ప్రధానంగా దృష్టి సారించామని వివరించారు. తమ హయాంలో విప్లవాత్మకంగా అభివృద్ధి చేసిన రంగాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. బీఆర్ఎస్‌కు రెండున్నర దశాబ్దాల చరిత్ర ఉన్నదని, ఆర్తి, ఆత్మగౌరవంతో నిర్మించుకున్న నాయకత్వం ఉన్నదని స్పష్టం చేశారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో దృఢమైన పార్టీ నిర్మాణం ఉన్నదని చెప్పారు. ఒక ఎన్నికల్లో ఎదురైన పరాజయంతో పార్టీకి వచ్చిన ఇబ్బందేమీ లేదని తేల్చిచెప్పారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై...

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో జనాభా ప్రాతిపదికను పరిగణనలోకి తీసుకోవటం అసంబద్ధమైన విధానమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభాను పెంచుకోవాలనే విధంగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ప్రస్తుత జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతులే లేని పరిస్థితి ఉన్నదని, ముందుగా వాటిని కల్పించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని సూచించారు. జనాభా నియంత్రణపై దక్షిణ భారతదేశానికి స్పష్టమైన అవగాహన ఉన్నదని చెప్పారు. జనాభా తగ్గించుకుని క్రమశిక్షణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు డీ లిమిటేషన్ పేరుతో నష్టం చేయడం అన్యాయమని వాపోయారు.